
# పాత నిబంధన గ్రంథము యొక్క ప్రాముఖ్యత

## పాఠము-II



బైబిలులోని అత్యున్నతమైన సత్యములు

*నీ వాక్యమే సత్యము. యోహాను 17:17*

బైబిలులోని అత్యున్నతమైన సత్యములు

పాఠము – II

# పాత నిబంధన గ్రంథము యొక్క ప్రాముఖ్యత

**ముఖ్య గమనిక:** ప్రతి వేద వాక్య సూచనల కొరకు, దయతో మీ బైబిలు గ్రంథమును పరిశీలన చేసి సమగ్రముగా చదవండి.

ఈ పాఠనములోని వేద వాక్యములు చాల మట్టుకు చట్ట పూర్వకముగా ప్రచురణ చేయబడిన "కింగ్ జేమ్స్ వెర్షన్" (**Authorized KJV**) మరియు బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా వారు ప్రచురించిన(**BSI Telugu Version**) బైబిలు గ్రంథము నుండి ఉన్నది ఉన్నట్లుగా వ్రాయబడియున్నది.

ఈ రోజు మనము పాత నిబంధన గ్రంథం యొక్క **ప్రాముఖ్యతను** మరియు **ఉద్దేశములను** పరిశుద్ధ గ్రంథములో ధ్యానించుకొందాం–




- <u>బైబిలులో 3/4 వంతు</u> పాత నిబంధన గ్రంథము, అది మొత్తం 39 పుస్తకాలను కలిగియున్నది.

- <u>ఈ రోజులలో చాలా మంది</u> పాత నిబంధన గ్రంథమునకు <u>ప్రాముఖ్యత ఇవ్వడం లేదు</u>.

బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా(**Bible Society of India**) సంస్థ కూడా బైబిలులో **పాత** నిబంధన గ్రంథమును మినహాయించి **క్రొత్త** నిబంధన గ్రంథమును **మాత్రమే** అచ్చు వేయుచున్నారు.

**పాత నిబంధన గ్రంథములోని కీర్తనల పుస్తకమును,** సామెతల పుస్తకమును మరియు కొందరు ప్రసంగి పుస్తకమును మాత్రమే చదువుచూ మిగిలిన వాటిని తెలుసుకోకుండానే సాధారణంగా విడిచి పెడుతున్నారు.

**<u>అనేకులు పాత నిబంధన గ్రంథమును ఒక చరిత్ర పుస్తముగానే</u>** భావించుచున్నారు – అనగా పూర్వ కాలములో **జరిగినపోయిన** సంగతులుగా పరిగణలోకి తీసుకొనుచున్నారు.

ఇశ్రాయేలీయులు మరియు వారి అనుభవాల గురించి,...యుద్ధాల గురించి,..ప్రత్యేకమైన వ్యక్తులను గురించి, వారి మాటల గురించి,...మరియు ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు నుంచి కనాను వరకు చేసిన ప్రయాణమును గురించి మరియు దాని తరువాత జరిగిన సంగతుల గురించి **కూడ**...పాత నిబంధన గ్రంథములో పొందుపరచబడియున్నది.



**అయితే ఎందుకు ఈ సంగతులన్ని ఇలా నమోదు చేయబడియున్నది?**

**ఇది కేవలం పూర్వ కాలపు చరిత్ర మత్రమేనా?- లేదా... ఇది కేవలం బైబిలు చరిత్ర మాత్రమేనా?**

ఇది వేల సంవత్సరాలకు ముందు **జరిగినటువంటి కార్యముల** యొక్క సంపూర్తి వివరణను కలిగి ఉన్నదా?

**దీని ముఖ్య ఉద్దేశము ఏమిటి?**

**ఆకరి ప్రశ్న ఏమంటే... <u>ఎలాగు</u> ప్రస్తుత కాలమందున్న క్రైస్తవులకు పాత నిబంధన గ్రంథము ప్రాముఖ్యమైనది?**

అయితే దాని యొక్క **కారణాలను** తెలుసుకోవడానికి ప్రారంభిస్తాము–

## కారణం – 1

## హెబ్రీయులకు 10:1

**"ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలదికాదు..."**

దీని యొక్క అర్థము ఏమి?

"ఛాయ"....అనగానేమి?

"రాబోవుచున్న మేలులు"....అనగానేమి?

ఇచ్చుట అపోస్తలుడైన పౌలు మోషే యొక్క ఆజ్ఞలను "**రాబోవుచున్న మేలుల**" "చాయగా" సూచిస్తున్నాడు.

**కాని ఎప్పుడు?**


**అవును, క్రీస్తు తరువాత!**

**దేవుడు చాలా ఖచ్చితమైన ప్రణాళికను కలిగి వున్నాడని, మనందరము ఇప్పటి వరకు తెలుసుకొనియున్నాము.**

కానీ యేసు భూమి మీదికి రాకముందు **దేవుని ప్రణాళికను మనుష్యులు అర్థం చేసుకొలేదు.**

**"రాబోవుచున్న మేలులు"** అను వాక్యము పాపపు మరియు మరణపు బంధకములో నున్న సమస్త మానవాళి కొరకైన **"దేవుని రక్షణ ప్రణాళికను"** సూచించుచున్నది, అది కల్వరి సిలువపై క్రీస్తు యేసు మరణము ద్వారా వచ్చు **విమోచన** పనిపై కేంద్రికరించబడియున్నది.

కాబట్టి యేసు రాకడ తరువాత ఈ **దైవీక ప్రణాళిక** నెరవేర్చబడును – యేసు **(గలతీ 4:4) తన కాలమునకు ముందు "చాయగా"** కనుపరచబడియున్నాడు.




ప్రస్తుత కాలపు **భవననిర్మాణవేత్తలు(Architect)** ఒక భవనమును పూర్తిగా నిర్మించిన తర్వాత అది ఎలా ఉండునని ముందుగానే ఊహాచిత్రమును చూపించుటకు ప్రయత్నించుదురు, అలాగే ఈ **"ఛాయలు"** కూడా దేవుని ప్రణాళికకు చిన్న **"నమూనా చిత్రముల"** వలె ఉన్నవి.

బైబిలు భాషలో దీనిని "నమూనా చిత్రాలు లేదా ఛాయలు లేదా **ప్రతిరూపలు"** అంటారు, దీనినే ఆంగ్ల భాషలో **"టైప్స్(Types)"** అని అంటారు, ఈ ఆంగ్ల పదము గ్రీకు పదమగు **"టుపొస్(Tupos)"** నుండి గ్రహించబడింది మరియు ఆ ఛాయలు నెరవేరినప్పుడు **"నిజాలు లేదా నిజ రూపాలు లెదా పురోసూచకము"** అని అంటాం, అయితే ఆంగ్లములో దానినే **"యాంటీటైప్స్(Antitypes)"** అని అంటారు.

**పాత నిబంధన గ్రంథము <u>అంతయు</u> చాయలతోను (ప్రతిరూపము) మరియు (నిజరూపము) నిజాలతోను నిండియున్నవి.**

కాబట్టి ఇక్కడ **హెబ్రీ 10:1**వ(మరలా పూర్తిగా చదవండి) వాక్యములో అపోస్తలుడైన పౌలు తెలియ పరుస్తున్నది ఏమనగా ప్రతి సంవత్సరం ఇశ్రాయేలీయులు అర్పించు ప్రాయశ్చిత దిన బలులు, పాపము నిమిత్తము యేసు ద్వారా నేర్చబడబోయే **"నిజమైన ప్రాయశ్చిత బలికి" "ఛాయగా లేదా నమూనాగా లేదా ప్రతిరూపముగా"** ఉన్నది. ఎందుకనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము <u>ప్రతి పాపము నుండి శుద్ధీకరణ చేయ జాలవు</u>.

దీనిని క్రింది వాక్యములో చదువుదాం-



హెబ్రీ. 10:4

**"ఏలయనగా ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము."**

పాత నిబంధన గ్రంథము యొక్క ప్రాముఖ్యతకు **రెండవ కారణం** ఇప్పుడు చదువుకుందాం–

# కారణం - 2

రోమా. 15:4

**"ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగునట్లు వ్రాయబడియున్నవి."**

కావున పాత నిబంధన గ్రంథములో వ్రాయబడినవన్నియు

**"...పూర్వమందు వ్రాయబడినవన్నియు...",**

**"మన"** కొరకు – అనగా **సంఘము** బోధను, ఓర్పును, నిరీక్షణను మరియు ఆదరణను అభివృద్ధి చేసుకొనుటకై వ్రాయబడియున్నది.

**ఇది ఎలా? అని ఎవరైనా అడగవచ్చు?**

ఎలాగైతే శరీరాను సారముగా బలహీనత మరియు అనారోగ్యం వున్నదో అలాగే **ఆత్మీయమైన బలహీనత మరియు అనారోగ్యం** కూడా వున్నది.



ఎవరికైనా **జలుబు** వచ్చినట్లయితే దానిని నయం చేయుటకు వారు **కొల్డ్ఎక్ట్(coldact)** లేదా **కొల్డరిన్(coldarin)** మాత్రలు వాడుతారు.

ఒక వేళ **జ్వరం** వచ్చినట్లతే స్వస్థత కొరకు వారు **క్రోసిన్(Crosin), కాల్-పాల్ (Cal-pal), పెరాసిటామోల్ (Paracetamol), నొవాల్-గిన్ (Novalgin)** ...మొదలైన మందులు వాడతారు.




ఇవన్నియు శరీరాను సారమైన అనారోగ్యాన్ని స్వస్థపరచుటకు సహాయ పడుతుంది.

అలాగే ఆత్మీయమైన రోగము కూడా ఆత్మీయమైన మందుల ద్వారా మాత్రమే **ఆత్మీయమైన విషయాలకు స్వస్థత** కలుగును.

**ఇప్పుడు కొన్ని ఆత్మీయ వ్యాధుల యొక్క స్థితిగతుల గురించి తెలుసుకుందాం.**

## ఒకరి విశ్వాసం...అలసి బలహీన పడిన యెడల...ఏమి జరుగుతుంది?



దీనికి తీసుకోవలసిన ఆత్మీయ <u>ఔషధం</u> ఏమిటంటే

**అబ్రాహాము**

అబ్రాహాముదేవుని యందు వుంచినటువంటి గొప్ప విశ్వాసం గూర్చి చదివినప్పుడు, అతను దేవుని మాటలకు లోబడి తను **అపారంగా ప్రేమించిన కుమారుని** కూడా **దహనబలిగా** సమర్పణ చేయుటకు

మూడు రోజుల పాటు ప్రయాణం చేసి వెనుకాడకుండా దేవుని మాటలకు లోబడి బలి ఇచ్చుటకే ఇష్టపడెను. ఇది **అదే దేవునిపై** మన విశ్వాసాన్ని కూడ పెంచుకొనుటకు ఉపయోగపడుతుంది ! **(ఆది. 22:1-15లో చదువుకుందాం)**

## ఈ యొక్క ప్రపంచంలో అవిశ్వాసులతో జీవిస్తున్నప్పుడు ఒకరి ఉత్సాహం ఏమౌతుంది?...మందంగా మారుతుందా?

ఆత్మీయ పరమైన **ఔషధం** మనం ఏమి తీసుకోవాలి అంటే –

## దానియేలు

దానియేలు మొదట <u>**బబులోను**</u> ప్రజల నడుమ ఉండినప్పుడు మరియు

✓ <u>మాదియ–పారసీక</u> దేశస్థులతో వున్నప్పుడు, అతను ఎన్నడు భయపడలేదు లేదా తన **దేవున్ని సేవించడంలో సిగ్గుపడలేదు**, ఇలాంటి ఉత్సాహం గురించి చదివినప్పుడు,

ఇప్పుడే అవిశ్వాసుల మధ్య **అదే** దేవునిపై **ఉత్సాముతో** కూడిన నూతన బలాన్ని ఇస్తుంది.




**జీవితంలో అనేక శ్రమల వలన...ఓర్పును కోల్పోయి, చిరాకుపడుతూ, సణుగుచున్నప్పుడు ఏమి జరుగుతుంది?**

ఆత్మానుసారంగా దీనికి తీసుకోవలసిన **మందులు** –

## యోబు

యోబు అనుభవాలను మరియు శ్రమలను గూర్చి అతని మాటలలో క్రింది వాక్యం ద్వారా చూస్తాం–



**యోబు 1:21**

**"నేను నా తల్లిగర్భములో నుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్లెదను, <u>యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొనిపోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక."</u>**

తరువాత క్రింది వాక్యంలో...

**యోబు 2:9,10**

**"అతని భార్య వచ్చి నీవు ఇంకను యథార్థతను వదలకయుందువా? దేవుని దూషించి మరణము కమ్మనెను. అందుకతడు మూర్ఖురాలు మాటలాడునట్లు నీవు మాటలాడుచున్నావు, మనము దేవునివలన మేలు అనుభవించుదుమా, కీడును మనము అనుభవింప తగదా అనెను. ఈ సంగతులలో ఏ విషయ మందును యోబు నోటి మాటతోనైనను పాపము చేయలేదు."**

అవును! మన యొక్క **శ్రమలు** మరియు **సమస్యలు** ఏదియు **యోబుతో పోల్చదగినది** కాదు.

ఇదికాకుండా, ప్రస్తుత కాలంలో కూడా యోబు పలికిన విశ్వాసపు మాటలు మనకు **అదే** దేవుని యందు ఓర్పును బలపర్చేదిగా ఉన్నది.

ఇలాగు ఆత్మీయ మందుల పట్టిక అధికమగుచున్నది...

**ఉదాహరణకు: నోవాహు, మోషే, యోసేపు, దావీదు, ఏలీయా**...మొదలగు ఆత్మీయ మందులు

వీరందరి అనుభవాలు మరియు జీవిత గాథలు...మనలను(సంఘాన్ని) **బలపర్చేది** గాను, **ప్రోత్సహించేది** గాను ఓదార్పునిచ్చేదిగాను ఉన్నది.

ఇప్పుడు మనం పాత నిబంధన గ్రంథం యొక్క ప్రాముఖ్యతకు **మూడవ కారణాన్ని** చూద్దాం-

## కారణం - 3

**1 కొరింథీ. 10:11**

**"ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను."**

అనగా పాత నిబంధన కాలంలో జరిగిన విషయాలన్నీ...

**"మనకు"** అనగా **సంఘమునకు "దృష్టాంతరూపకములుగా(ENSAMPLES)"** సంభవించియున్నది.

ఏదేది **దృష్టాంతములు**?

"దృష్టాంతములన్నియు" పాత నిబంధన గ్రంథము నందు ప్రజల యొక్క కథలను వివరించిన విధంగా ప్రత్యేక స్థితి యందు వారి పాత్రలను లేక గుణాతిశయములను మనకు మాదిరిగా నటించియున్నారు లేక చేసియున్నారు.

**"దృష్టాంతరూపకములుగా(ENSAMPLES)"** అనగా ప్రజల యొక్క జీవితచరిత్రలో **ఉదాహరణగా చేయబడిన కార్యములు,** ఈ సందర్భములో పాత నిబంధనలోని **మనుష్యులు.**

## "దృష్టాంతము" అను పదమునకు సరియైన లేదా ఖచ్చితమైన అర్థమేమి?

పాత నిబంధన గ్రంథము నుంచి ఒక మంచి దృష్టాంతమును లేదా మాదిరిగా వున్న ఒక భాగాన్ని తీసుకొని ధ్యానించినప్పుడు, దీనిని మనము అర్థం చేసుకోగలము–

మనకు **దృష్టాంతముగా** లేదా మాదిరిగా వున్న ఒక సంగతిని క్రింది వాక్యభాగంలో చదువుకుందాం.

## ఆదికాండము 24:1-67

**(పూర్తిగా చదువగలరు)**

ఇందులో అబ్రాహాము తన ప్రియ కుమారుడైన ఇస్సాకుకు **"వధువును"** చూడడానికి తన సేవకున్ని ముందుకు పంపినటువంటి సంభవము వ్రాయబడింది.

ఈ కథను బైబిలు నుంచి ముందుగా చదువుకుందాం–

క్రింది వాక్యమును చదువుదాం–

## ఆదికాండము 24:1,2

**"...అన్ని విషయములలోను యెహోవా అబ్రాహామును ఆశీర్వదించెను. అప్పుడు అబ్రాహాము తనకు కలిగిన సమస్తమును ఏలుచుండిన తన యింటి పెద్దదాసునితో నీ చెయ్యి నా తొడక్రింద పెట్టుము."**

అవును, వృద్ధాప్యంలో అబ్రాహాము తన **"ఏకైక"** కుమారుడగు "ఇస్సాకు" కొరకు ఒక వధువును తీసుకొనిరావలయునని ఒక ప్రణాళికను రూపొందించెను.

దీనిని గురించి మరిన్ని విషయాలను క్రింది వాక్యములో చదువుదాం-



**ఆదికాండము 24:3-4**

**"నేను ఎవరి మధ్య కాపురమున్నానో ఆ కనానీయుల కుమార్తెలలో ఒక దానిని నా కుమారునికి పెండ్లిచేయక, నా స్వదేశమందున్న నా బంధువులయొద్దకు వెళ్లి ఇస్సాకను నా కుమారునికి భార్యను తెచ్చునట్లు..."**

అతను తన ప్రధాన దాసుడైన **ఎలీయెజెరుకు** ఇలా సూచనలు ఇస్తున్నాడు -

**( ఆదికాండము 15:2 - "దమస్కు ఎలీయెజెరే నాయింటి ఆస్తి కర్తయగును గదా." )**

**"నేను ఎవరి మధ్య కాపురమున్నానో ఆ కనానీయుల కుమార్తెలలో ఒక దానిని"**

నా కుమారునికి వధువును ఎన్నుకోవద్దని ప్రమాణం చేసుకొనెను...అయితే......

**"నా స్వదేశమందున్న నా బంధువులయొద్దకు..."**

వెళ్లి నా కుమారునికి భార్యను తేవలయునని అబ్రాహాము తన సేవకునికి ఉత్తరమిచ్చెను.

ఇక్కడ అబ్రాహాముయొక్క స్వదేశము...**"దూరపు దేశమును"** సూచించుచున్నది.

తరువాత క్రింది వాక్యాలలో ఈ సంగతులను చదువుటకు కొనసాగిద్దాం-

**ఆదికాండము 24:10**

**"అతడు తన యజమానుని ఒంటెలలో పది ఒంటెలను తన యజమానుని ఆస్తిలో శ్రేష్ఠమైన నానా విధములగు వస్తువులను తీసికొని పోయెను. అతడు లేచి అరామ్నహరాయిములోనున్న నాహోరు పట్టణము చేరి..."**



ఎలీయెజెరు **"నానా విధములగు శ్రేష్ఠమైన మంచి వస్తువులను"** **(యన్ఐవి/తెలుగు బైబిలు ప్రచురణలో)** **పది ఒంటెల** నిండా తీసుకొని మెసపటొమియా లోని నాహోరు పట్టణమునకు దూర ప్రయాణమైపోయెను.

ఇంకను క్రింది వాక్యములో చదువుదాం-

**ఆదికాండము 24:11**

**"సాయంకాలయందు స్త్రీలు నీళ్లు చేదుకొనవచ్చు వేళకు ఊరి బయటనున్న నీళ్లబావియొద్ద తన ఒంటెలను మోకరింపచేసి యిట్లనెను"**




అవును! చివరికి అతని ప్రయాణం సాయంకాలమందు ఒక **"నీళ్లబావి"** యొద్ద తీసుకువచ్చెను ....అప్పుడు అది స్త్రీలు ఆ నీళ్లబావి నుండి నీళ్లు చేదుకొనవచ్చు సమయం.

అక్కడ ఎలీయెజెరు ఒంటెలతో కూర్చుని, క్రింది వాక్యములో వ్రాయబడినట్లు ప్రార్థించసాగెను చదువుదాం-

**ఆదికాండము 24:12-14**

**"నా యజమానుడగు అబ్రాహాము దేవుడవైన యెహోవా,...చిత్తగించుము, నేను ఈ నీళ్ల ఊటయొద్ద నిలుచుచున్నాను, ఈ ఊరివారి పిల్లలు నీళ్లు చేదుకొనుటకు వచ్చుచున్నారు.**

కాబట్టి నేను త్రాగునట్లు నీవు దయచేసి నీ కడవను వంచుమని నేను చెప్పగా – నీవు త్రాగుము నీ ఒంటెలకును నీళ్లు పెట్టెదనని యే చిన్నది చెప్పునో ఆమెయే నీ సేవకుడైన ఇస్సాకు కొరకు నీవు నియమించినదై యుండును గాక,...”



అవును! ఎలీయెజెరు **మర్గదర్శకము** కొరకు అబ్రాహాము దేవునికి ప్రార్థించెను, ఇంకను ఎంచుకున్న అమ్మయిని సరిగ్గా **గుర్తించుట** కొరకు ఖచ్చితమైన **“ఆనవాలును”** కూడ ప్రార్థనలో ప్రస్తావించాడు.

“...నీవు త్రాగుము నీ ఒంటెలకును నీళ్లు పెట్టెదనని యే చిన్నది చెప్పునో...”



**అటుతరువాత ఏమి జరిగెను?** క్రింది వాక్యమును చదువుటకు కొనసాగిదాం-

**ఆదికాండము 24:15**

“అతడు మాటలాడుట చాలింపకముందే అబ్రాహాము సహోదరుడైన నాహోరు భార్యయగు మిల్కా కుమారుడైన బెతూయేలుకు పుట్టిన రిబ్కా కడవ భుజము మీద పెట్టుకొనివచ్చెను.”

**“అతను మాటలాడి చాలించక ముందే” రిబ్కా** నీళ్లు చేదుకోవడానికి ఆ భావి యొద్దకు వచ్చింది.

తరువాత ఏమి జరిగిందో చదువుకుందాం-

**ఆదికాండము 24:16**

**"ఆ చిన్నది మిక్కిలి చక్కనిది, ఆమె కన్యక, ఏ పురుషుడును ఆమెను కూడలేదు, ఆమె ఆ బావిలోనికి దిగిపోయి కడవను నీళ్లతో నింపుకొనియెక్కి రాగా..."**

అవును! ఆమె **మిక్కిలి చక్కనిది** మరియు.....ఆమె **కన్యక.**

తరువాత చదువుటకు కొనసాగిదాం-

**ఆదికాండము 24:17-19**

**"ఆ సేవకుడు ఆమెను ఎదుర్కొనుటకు పరుగెత్తి నీ కడవలో నీళ్లు కొంచెము దయచేసి నన్ను త్రాగనిమ్మని అడిగెను. అందుకామె అయ్యా త్రాగుమని చెప్పి త్వరగా తన కడవను చేతిమీదికి దించుకొని అతనికి దాహమిచ్చెను. మరియు ఆమె అతనికి దాహమిచ్చిన తరువాత - నీ ఒంటెలు త్రాగుమట్టుకు వాటికిని నీళ్లు చేదిపోయుదునని చెప్పి..."**

అవును! ఎలీయెజెరు ఆమెను త్రాగడానికి నీళ్లు అడిగాడు ఆమె వెంటనే అందిస్తూ అంటుంది......

**"అందుకామె అయ్యా త్రాగుమని చెప్పి"**



...మరియు ఆ ఒంటెలకు కూడా నీళ్లు చేదిపోసిందని చూస్తాం.

**ఎంచుకున్న అమ్మాయిని సరిగ్గా గుర్తించుట కొరకు దేవునికి ఎలీయెజెరు చేసిన ప్రార్థనలోని "ఆనవాలు" ఎంత ఖచ్చితంగా మరియు సరిగ్గా నెరవేరెను.**

తరువాత ఏమి జరిగిందో చదువుకుందాం-

**ఆదికాండము 24:20-21**

**"త్వరగా గాడిలో తన కడవ కుమ్మరించి తిరిగి చేదుటకు ఆ బావికి పరుగెత్తుకొనిపోయి అతని ఒంటెలన్నిటికి నీళ్లు చేదిపోసెను. ఆ మనుష్యుడు ఆమెను తేరి చూచి తన ప్రయాణమును యెహోవా సఫలముచేసెనో లేదో తెలిసికొనవలెనని ఊరకుండెను."**

అవును! ఆమె 10 ఒంటెలకు నీళ్లు చేది పోయడం...."**మిక్కిలి కఠినమైన పని**" !!



**(ఒక ఒంటె సుమారుగా 10 కుండల నీళ్లు త్రాగుతుంది...మొత్తం సుమారు 100 కుండల నీళ్లను రిబ్కా చేదిపోసెనో...ఒక్కసారి ఊహించిచూడండి. (ఒక సారి ఒంటె నీళ్లు త్రాగితే మరళా అది ఆరు నెలల తరువాత నీళ్లు త్రాగుతుందని ఒక లెక్కలో చెప్పారు)).**

ఇదంతా ముగించు వరకు... ఎలీయెజెరు ఆమెను **ఆశ్చర్యముతో చూస్తునే ఉన్నాడు** మరియు తన ప్రార్థనను విన్నందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు తెలియజేస్తూనే ఉన్నాడు. మరియు తరువాత చదువుకుందాం.

**ఆదికాండము 24:22**

**"ఒంటెలు త్రాగుటయైన తరువాత ఆ మనుష్యుడు అరతులము ఎత్తుగల బంగారపు ముక్కుకమ్మిని, ఆమె చేతులకు పది తులముల ఎత్తుగల రెండు బంగారు కడియములను తీసి..."**



**దాని తరువాత**, ఎలీయెజెరు అన్నింటిని గమనిస్తూ, ఆమెకి బహుమానములిచ్చెను...

- ఒక అరతులము ఎత్తుగల **"బంగారపు ముక్కుకమ్మి"** మరియు
- ఆమె చేతులకు పది తులముల ఎత్తుగల **"బంగారపు కడియములను"** బహుకరిస్తాడు.

ఈ యొక్క విలువైన అందమైన బహుమతులను స్వీకరించిన రిబ్కా **నిశ్చేష్టురాలై** మరియు **ఎంత ఆశ్చర్యపడి** ఉంటుందో మీరే ఆలోచించండి.

కేవలం పది ఒంటెలకు బావి నుంచి నీళ్లు చేది పోయడం వలన ఇంత గొప్ప బహుమతులు ఇవ్వడం ఎంత ఎక్కువో కదా!

**అందుకే ఆమె చాలా ఆశ్చర్యపడింది!**

తరువాత చదువుకుందాం.

**ఆదికాండము 24:23**

**"నీవు ఎవరి కుమార్తెవు? దయచేసి నాతో చెప్పుము, నీ తండ్రి యింట మేము ఈ రాత్రి బసచేయుటకు స్థలమున్నదా అని అడిగెను."**

అవును! తరువాత ఎలీయెజెరు ఆమె కుటుంబస్తుల వివరాలను కూపీతీసెను మరియు ఆమె ఇంట బసచేయుటకు స్థలమున్నదా? అని రిబ్కాను అతను అడిగినప్పుడు, ఆమె ఈ విధంగా జవాబిస్తుంది.

**ఆదికాండము 24:24వ వచనము - "అందుకామె నేను నాహోరుకు మిల్కాకనిన కుమారుడగు బెతూయేలు కుమార్తెననెను."**

**ఆమె అబ్రాహాముయొక్క పెద్ద అన్న అయిన నాహోరుకు మనవరాలు.**

తరువాత రిబ్కా ఇలాగు వివరిస్తూవస్తుంది...

**ఆదికాండము 24:25**

**"మరియు ఆమె మా యొద్ద చాలా గడ్డియు మేతయు రాత్రి బసచేయుటకు స్థలమును ఉన్నవనగా..."**

అటుతరువాత, అతనిని ఆ రాత్రి బసచేయుటకు ఆమె తన ఇంటికి ఆహ్వానిస్తుంది మరియు ఒంటెలకు మేతయు, వుండడానికి స్థలమును ఉన్నదని నిశ్చయపరచుచున్నది.



అతన్ని ఆహ్వానించి, ఆమె **చాలా ఉత్సాహంతో** తన ఇంటికి పరుగెత్తి తన కుటుంబస్తులకి తెలియపరుస్తుంది.

ఈ క్రింది వాక్యంలో దాన్ని చదువగలము-

**ఆదికాండము 24:28-30**

**"అంతట ఆ చిన్నది పరుగెత్తికొనిపోయి యీ మాటలు తన తల్లి యింటి వారికి తెలిపెను. రిబ్కాకు లాబానను నొక సహోదరుడుండెను. అప్పుడు లాబాను ఆ బావిదగ్గర వెలుపటనున్న ఆ మనుష్యుని యొద్దకు పరుగెత్తికొని పోయెను.**

**అతడు ఆ ముక్కు కమ్మిని తన సహోదరి చేతులనున్న ఆ కడియములను చూచి ఆ మనుష్యుడు ఈలాగు నాతో మాటలాడెనని తన సహోదరియైన రిబ్కా చెప్పిన మాటలు విని ఆ మనుష్యుని యొద్దకు వచ్చెను. అతడు బావియొద్ద ఒంటెల దగ్గర నిలిచియుండగా.."**

తరువాత **ఆమె పరుగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళి** తన **తండ్రితోను** మరియు **తన అన్న లాబాను** తోను చెబుతుంది.

తరువాత వారు తిరిగి **"పరుగెత్తుకుంటూ"** వచ్చి ఎలీయెజెరును తమ ఇంటికి ఆహ్వానిస్తారు.

ఎందుకనగా, ఎవ్వరు ప్రతి దినము ఆ బావి వద్ద ఇంతటి గొప్ప మరియు **విలువగల** బహుమతులు పొందుకొనరు.

సేదదీరిన తరువాత, ఎలీయెజెరు తనను పరిచయం చేసుకుంటూ తాను వచ్చిన ఉద్దేశమును అతనికి తెలిపెను, క్రింది వాక్యాలలో దానిని చదువుకుందాం.

## ఆదికాండము 24:34

**"అంతట అతడిట్లనెను అబ్రాహాము దాసుడను,..."**

అవును! ఎలీయెజెరు తనను, అబ్రాహాము యొక్క దాసుడుగా పరిచయం చేసుకుంటాడు మరియు **అతడు దేని నిమిత్తము ప్రయాణం చేసి వచ్చెనను కార్యములను** గురించి వివరించుట, ఈ క్రింది వాక్యాలలో చూస్తాం.

## ఆదికాండము 24:35-48

**(వాక్యములను పూర్తిగా చదువగలరు)**

**"యెహోవా నా యజమానుని బహుగా ఆశీర్వదించెను గనుక అతడు గొప్పవాడాయెను అతనికి గొఱ్ఱెలను గొడ్లను వెండి బంగారములను దాస దాసీ జనమును ఒంటెలను గాడిదలను దయచేసెను. నా యజమానుని భార్యయైన శారా వృద్ధాప్యములో నా యజమానునికి కుమారుని కనెను నా యజమానుడు తనకు కలిగినది యావత్తును అతనికిచ్చి యున్నాడు, మరియు నా యజమానుడు నాతో - నేను ఎవరి దేశమందు నివసించుచున్నానో ఆ కనానీయుల పిల్లలలో ఒక పిల్లను నా కుమారునికి పెండ్లిచేయవద్దు. అయితే నా తండ్రి యింటికిని నా వంశస్థుల యొద్దకును వెళ్లి నా కుమారునికి పెండ్లి చేయుటకు ఒక పిల్లను తీసికొని రావలెనని నాచేత ప్రమాణము చేయించెను. అప్పుడు నేను నా యజమానునితో - ఆ స్త్రీ నా వెంట రాదేమో అని**

**చెప్పినందుకు అతడు ఎవని సన్నిధిలో నేను జీవించుచున్నానో ఆ యెహోవా నీతో కూడ తన దూతను పంపి నీ ప్రయాణము సఫలము చేయును గనుక నీవు నా వంశస్థులలో నా తండ్రి యింటనుండి నా కుమారునికి భార్యను తీసికొని వచ్చెదవు, నీవు నా వంశస్థులయొద్దకు వెళ్లితివా యీ ప్రమాణము విషయములో ఇక నీకు బాధ్యత ఉండదు, వారు ఆమెను ఇయ్యనియెడలకూడ ఈ ప్రమాణము విషయములో నీకు బాధ్యత ఉండదని చెప్పెను. నేను నేడు ఆ బావి యొద్దకు వచ్చి అబ్రాహామను నా యజమానుని దేవుడవైన యెహోవా, నా ప్రయాణమును నీవు సఫలము చేసిన యెడల, నేను ఈ నీళ్ల బావియొద్ద నిలిచియుండగా నీళ్లు చేదుకొనుటకు వచ్చిన చిన్నదానితో నేను – నీవు దయచేసి నీ కడవలో నీళ్లు కొంచెము నన్ను త్రాగనిమ్మని చెప్పునప్పుడు, నీవు త్రాగుము నీ ఒంటెలకును చేది పోయుదునని యెవతె చెప్పునో ఆమెయే నా యజమానుని కుమారునికి యెహోవా నియమించిన పిల్లయై యుండును గాకని మనవిచేసికొంటిని. నేను నా హృదయములో అట్లు అనుకొనుట చాలింపకముందే రిబ్కా భుజముమీద తన కడవను పెట్టుకొనివచ్చి ఆ బావిలోనికి దిగిపోయి నీళ్లు చేదుకొని వచ్చెను అప్పుడు నాకు దాహమిమ్మని నేనామెను అడుగగా, ఆమె త్వరగా తన కడవను దించి – త్రాగుము, నీ ఒంటెలకును నీళ్లు పెట్టెదనని చెప్పెను గనుక నేను త్రాగితినిబీ ఆమె ఒంటెలకును నీళ్లు పెట్టెను. అప్పుడు నేను –నీవు ఎవరికుమార్తెవని యడిగినందుకు ఆమె –మిల్కా నాహోరునకు కనిన కుమారుడగు బెతూయేలు కుమార్తెనని చెప్పినప్పుడు, నే నామె ముక్కుకు కమ్మియును ఆమె చేతులకు కడియములను పెట్టి, నా తలవంచి యెహోవాకు మ్రొక్కి, అబ్రాహామను నా యజమానుని దేవుడైన యెహోవాను స్తోత్రము చేసితినిబీ ఏలయనగా ఆయన నా యజమానునియొక్క సహోదరుని కుమార్తెను అతని కుమారునికి తీసికొనునట్లు సరియైన మార్గమందు నన్ను నడిపించెను.”**

అవునండి! అతను ప్రయాణమై వచ్చిన ఉద్దేశమును,…ఆ రోజు బావి వద్ద అతనికి కలిగినటువంటి అనుభవాలను గురించి మరియు….ఇస్సాకు కొరకు ఏర్పరచబడిన వధువగు రిబ్కాను కనుగొనడానికి దేవుడు అతనిని చాలా దయతోను, **అద్భుతంగాను** ఎలా నడిపించెనను సంగతులను…వారికి **చక్కగా వివరించెను.**



ఆకరిగా ఎలీయెజెరు రిబ్కా వివాహ విషయంలో వారి ప్రత్యుత్తరమును అడుగుతాడు, దానిని గూర్చి క్రింది వాక్యంలో చదువుకుందాం-

**ఆదికాండము 24:49**

"And now if ye will deal kindly and truly with my master, tell me: and if not, tell me; <u>that I may turn to the right hand, or to the left."</u>

**"కాబట్టి నా యజమానునియెడల మీరు దయను నమ్మకమును కనుపరచినయెడల అదియైనను నాకు తెలియచెప్పుడి, లేనియెడల అదియైనను తెలియ చెప్పుడి <u>అప్పుడు నేనెటు పోవలెనో అటు పోయెదననగా"</u>**

ఎలీయెజెరు రిబ్కా **"చేతిని అప్పగించుటకు"** సంబంధించి బెతూయేలు మరియు లాబాను వద్ద నిర్ణయమును అడుగుతున్నాడు.

"that I may turn to the right hand or to the left".

**("నేను కుడిచేతి వైపునను లేక ఎడమచేతి వైపునను వెళ్ళెదననెను.") (కెజెవి, ఆంగ్ల బైబిలు వాక్యంలో)**

ఇందులో **"కుడివైపునకు తిరగడం అంగీకారానికి"** సూచనగాను, **"ఎడమవైపునకు తిరగడం తిరస్కారానికి"** సూచనగాను వున్నది.

మరియు దానికి వారు ఇలా ప్రత్యుత్తరమిస్తున్నారు-

## ఆదికాండము 24:50-51

**అందుకు వారు ఇలా చెప్పుచున్నారు - "...ఇది యెహోవావలన కలిగిన కార్యము,...ఇదిగో రిబ్కా...,ఆమెను తీసికొని పొమ్ము..."**

## ఆదికాండము 24:53

**"తరువాత ఆ సేవకుడు వెండి నగలను బంగారు నగలను, వస్త్రములను తీసి రిబ్కాకు ఇచ్చెను మరియు అతడు ఆమె సహోదరునికి తల్లికిని విలువగల వస్తువులు ఇచ్చెను."**

అతను(**ఎలీయెజెరు**) రిబ్కాకు...

- "వెండి నగలను మరియు బంగారు నగలను, వస్త్రములను" బహుకరిస్తాడు.
- మరియు ఆమె **సహోదరునికి తల్లికిని "విలువగల వస్తువులు"** ఇస్తాడు.

**మొదటగా** వెండి నగలను, తరువాత...**బంగారు** ఆభరణాలు ఇచ్చుట వింతగా లేదా?

అవును! ఇందులో కూడా కొంత **మరుగైయున్న ప్రాముఖ్యమైన విషయాలు** దాగివున్నాయి. తరువాత చదువుట కొనసాగిద్దాం-

## ఆదికాండము 24:54-56

**"అతడును అతనితోకూడనున్న మనుష్యులును అన్నపానములు పుచ్చుకొని అక్కడ ఆ రాత్రియంతయు నుండిరి. ఉదయమున వారు లేచినప్పుడు అతడు నా యజమానుని యొద్దకు నన్ను పంపించుడని చెప్పగా, ఆమె సహోదరుడును ఆమె తల్లియు ఈ చిన్నదాని పదిదినములైనను మాయొద్ద ఉండ నిమ్ము, ఆ తరువాత ఆమె వెళ్లవచ్చుననిరి. అప్పుడతడు -యెహోవా నా ప్రయాణమును సఫలము చేసెను గనుక నాకు తడవు కానీయక నన్ను పంపించుడి, నా యజమానుని యొద్దకు వెళ్లెదనని చెప్పినప్పుడు"**



ఆ రాత్రి అతడు అక్కడనే బస చేస్తాడు మరియు **రిబ్కా యొక్క ఇంటివారు** అతనిని

**"కనీసం పది దినములైనా"** వుండమని చెప్పడానికి ప్రయత్నిస్తారు...

....కానీ మరుసటి ఉదయమందు ఎలీయెజెరు **వెంటనే తనను పంపమని** వారి అనుమతి కోరుతాడు.

కాని వారు **దానికి వ్యతిరేకముగా** ఒప్పించడానికి ప్రయత్నిస్తారు కాని అతడు అచ్చట నుండి కనాను చేరుకోవాలన్న దృఢమైన నిర్ణయం కలిగివుంటాడు.

ఇతను ఇలాంటి పట్టుదల కలిగివున్నప్పుడు వారు రిబ్కాను పిలిచి ఆమెను ఏవిధంగా అడుగుతారో, క్రింది వాక్యంలో చదువుకుందాం –

**ఆదికాండము 24:58**

"రిబ్కాను పిలిచి – ఈ మనుష్యునితో కూడ వెళ్లెదవా అని ఆమె నడిగినప్పుడు – వెళ్లెదననెను."



వారు రిబ్కాను అడిగినప్పుడు, ఆమె ఇలా ప్రత్యుత్తరమిస్తుంది–

"నేను వెళ్ళెదను" అనెను.

రిబ్కా యొక్క **విశ్వాసమును** ఊహించండి,...**పరిచయమై 24 గంటలు కూడ కాని** ఎవరో తెలియని వ్యక్తితో వెళ్ళడానికి ఆమె సంకోచించకుండా ఇష్టపడుతున్నది.

**ఆమె ఈ నిర్ణయంతో తన జీవితాన్ని ప్రమాదములో వుంచుతున్నది.**

తరువాత చదువుకుందాం –

**ఆదికాండము 24:60**

"వారు రిబ్కాతో మా సహోదరీ, నీవు వేల వేలకు తల్లి వగుదువు గాక,..."

**అవును** రిబ్కా ఒక విశేషమైనటువంటి ఆశీర్వాదముతో వారి చేత ఆశీర్వదించ బడుతున్నది–

## “నీవు వేల వేలకు తల్లివగుదువుగాక” అనునది ఒక ఆశ్చర్యకరమైన ప్రకటన కాదా?

## శబ్దార్థప్రకారముగా, ఆమె వేల వేల పిల్లలకు తల్లి అవడం సాధ్యపడుతుందా?

ఈ పాఠము యొక్క చివరిలో, పై వాక్యము యొక్క **ప్రాముఖ్యతను** తెలుసుకుందాం.

వాక్యం చదువుకొని తరువాతి భాగం కొనసాగిద్దాం-



**ఆదికాండము 24:61**

**“రిబ్కాయు ఆమె పని కత్తెలును లేచి ఒంటెల నెక్కి ఆ మనుష్యుని వెంబడి వెళ్లిరి....”**

అవును! ఆఖరిగా రిబ్కా ఎలీయెజెరుతో ప్రయాణిస్తుంది మరియు ఆమెతో తన.... **“పనికత్తెలు”** - ఆమెకు సహాయం చేయడానికి ఇతర కన్యకలు.

వారు అబ్రాహాము యొక్క దేశమగు **కనానుకు** దూర ప్రయాణమును ప్రారంభించిరి.

ఆఖరిగా ఆ ప్రయాణ అంతమందు ఏమి జరిగిందో క్రింది వాక్యాలలో చదువుకుందాం.

**ఆదికాండము 24:63-67**

**“సాయంకాలమున ఇస్సాకు పొలములో ధ్యానింప బయలువెళ్లి కన్నులెత్తి చూచినప్పుడు ఒంటెలు వచ్చుచుండెను, రిబ్కా కన్నులెత్తి ఇస్సాకును చూచి ఒంటెమీద నుండి దిగి మనల నెదుర్కొనుటకు పొలములో నడుచుచున్న ఆ**

**మనుష్యుడెవరని దాసుని నడుగగా అతడు – ఇతడు నా యజమానుడని చెప్పెను గనుక ఆమె ముసుకు వేసికొనెను. అప్పుడా దాసుడు తాను చేసిన కార్యములన్నియు ఇస్సాకుతో వివరించి చెప్పెను.**

**ఇస్సాకు తల్లియైన శారా గుడారములోనికి ఆమెను తీసికొనిపోయెను. అట్లు అతడు రిబ్కాను పరిగ్రహింపగా ఆమె అతనికి భార్య ఆయెనుబీ అతడు ఆమెను ప్రేమించెను. అప్పుడు ఇస్సాకు తన తల్లి విషయమై దుఃఖనివారణపొందెను."**



వారు తమ గమ్యస్థానానికి చేరువైనప్పుడు **"పొలములో"** ద్యానిస్తున్న ఇస్సాకును చూచి రిబ్కా అతనిని గూర్చి ఎలీయెజెరును విచారిస్తుంది. అందుకు ఇస్సాకును గురించి ఎలీయెజెరు ఆమెకు ఈ విధంగా తెలుపుతున్నాడు...

**"అతడు నా యజమానుడు"** అని అంటాడు.

తరువాత ఆమె ముసుగు వేసుకొనెను. ఇస్సాకును **కలిసిన తరువాత** వారు వివాహం చేసుకొన్నారు, అలాగు రిబ్కా, ఇస్సాకుకు **భార్య** అయింది.

ఇది బైబిలులో ఒక భాగం – ఇది....**దృష్టాంతరూపకములుగా(ENSAMPLES)** లేదా **మాదిరికరంగాను** లేదా **ఛాయగాను** జరిగినది మరియు...వాస్తవానికి <u>**ఇది** అబ్రాహాము జీవితంలో ప్రత్యక్షముగా చోటు చేసుకున్న సంఘటన</u>...ఇది ఒక ఛాయ లేదా మదిరి.

**అవును! ఇది "మనకు" అనగా సంఘమునకు నటనవలె ప్రత్యక్షముగా కనుపరచబడిన ఒక చర్య మరియు...ఇది సంఘమునకు చాలా ప్రత్యేకమైనది మరియు ముఖ్యమైనది.**

ఇప్పుడు మనం ఈ వాక్య భాగంలో ఉపయోగించినబడిన **దృష్టాంతముల** యొక్క అర్థములను మరియు సూచనలను చూద్దాం-

అబ్రాహాము తన **"ఏకైక"** ప్రియ కుమారుడైన ఇస్సాకునకు **వధువును** చూడమని పంపినట్లే -

ఇప్పుడు కూడా **వధువును** ఎన్నుకొనే **మరియొక** ప్రక్రియ జరుగుతుండడం మనం చూడబోతున్నాము !!

ఈ సంగతిని క్రింది వాక్యంలో చదువుకుంటాం-

**2 కొరింథీ 11:2**

"...ఎందుకనగా పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి, అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని, మిమ్మును ప్రధానము చేసితిని..."

అవునండి! ఇది యేసుక్రీస్తు కొరకు **"వధువును"** ఎంపిక చేసే ప్రక్రియ !

**ఆ వధువు సంఘమే..!**

(ప్రకటన 19:7 - "...గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది, ఆయన భార్య తన్నుతాను సిద్ధపరచుకొనియున్నది...")

ప్రస్తుత కాలములో...ఆ "వధువు" యొక్క **ఎంపిక ప్రక్రియ** జరుగుతూ వున్నది - అది **సంఘము** అని పిలువబడే తరగతి.

**సంఘము...అని పిలువబడే క్రీస్తు యొక్క వధువును ఎంపిక చేసే ప్రక్రియను, ఈ దృష్టాంతముల ద్వారా లేదా ఛాయల ద్వారా లేదా మాదిరికరమగు కార్యముల ద్వారా చాలా స్పష్టముగా మరియు లోతుగా అర్థం చేసుకొనగలము.**

ప్రస్తుతం దృష్టాంతముగా చెప్పబడిన ఈ బైబిలు వాక్య భాగములోని వివిధ సూచనలను గూర్చి తెలుసుకుందాం-

## అబ్రాహాము

**అబ్రాహాము తండ్రియైన దేవునికి ఛాయ**

తన **ఏకైక కుమారుడగు** ఇస్సాకును బలి ఇవ్వడానికి ఇష్టపడుట ద్వారా అబ్రాహాము **తండ్రియైన దేవునికి ఛాయగా లేదా మదిరిగా లేదా సూచకముగా** దృవీకరించుకొనవచ్చును, ఎలా తండ్రియైన దేవుడు లోక రక్షణ నిమిత్తము తన **"అద్వితీయ కుమారుడైన"** యేసుని బలిగా ఇచ్చిన విధముగానే అబ్రాహాము కూడ చేసినందువలన, ఇక్కడ తండ్రి పోలికను కలిగియున్నాడు. **(యోహాను 3:16)**

## ఇస్సాకు

తండ్రియైన దేవుని **అద్వితీయ కుమారునికి ఛాయగా ఉన్నాడు. (యోహాను.1:18)**

## ఎలీయెజెరు

**ఇతను ఎవరికి సూచనగా ఉన్నాడు?**

అబ్రాహాము **ప్రధాన దాసుడే** లేదా సేవాకుడే ఈ ఎలీయెజెరు–

దేవుడు కూడా తన పని యంతటిలో ప్రధాన సేవకుడ్ని కలిగియున్నాడు !

పూర్వమందు సేవకులు **వారిని గూర్చి వారే మాట్లాడరు**...కావున దేవుని ప్రధాన సేవకుని గురించి కూడా తెలుకొనుటకు క్రింది వాక్యమును చదువుకుందాం–

**యోహాను 16:13**

**"<u>Howbeit when he, the</u> Spirit of Truth is come, he will guide you into all truth: for He shall <u>not speak of Himself</u>...."**

**"అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును ఆయన <u>తనంతట తానే యేమియు బోధింపక</u> (ఆంగ్లములో <u>మాట్లడక</u> అని వ్రాయబడియున్నది సరి చుసూకొని చదవండి),..."**

అవునండి! ఇప్పుడు **పరిశుద్ధాత్మ** యొక్క **దైవిక శక్తి** ద్వారా మాత్రమే సంఘము యొక్క ఎంపిక జరుగుచున్నది, దీనిని క్రింది వాక్యంలో చదువుకుందాం–

**లూకా 24:49 – "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నానుబీ మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను."**

ఎలీయెజెరు...**దేవుని పరిశుద్ధాత్మకు** ఛాయగావున్నాడు.

ఆపై దీన్ని చదవడం కొనసాగిస్తాం–

**ఆదికాండము 24:3**

**"<u>నేను ఎవరి మధ్య కాపురమున్నానో</u> ఆ కనానీయుల కుమార్తెలలో ఒక దానిని నా కుమారునికి పెండ్లిచేయక,"**

దేవుడు **"నివాసమున్న వారి మధ్య(ఎవరి మధ్య కాపురమున్నానో)"** అనగా పరలోక రాజ్యములోని **దేవదూతలలో** తన కుమారునికి వధువును ఎంపిక **చేయకూడదను** దేవుని నిర్ణయాన్ని ఈ వాక్యం సూచిస్తున్నది.

ఈ ఎంపిక యొక్క నియమాలు చాలా **నిర్దిష్టమైనవి** !

క్రింది వాక్యం ద్వారా చదువుకుందాం–

**ఆదికాండము 24:4**

**"నా స్వదేశమందున్న..."**

అవును! ఇది పరలోకం నుంచి చాలా **దూర దేశమగు**...ఈ **భూలోకాన్ని** సూచిస్తున్నది !

అవునండి! తన ప్రియ కుమారునికి "వధువును" **మానవాళి** నుండి <u>**మాత్రమే**</u> ఎంపిక చేయాలని నిర్ణయించియున్నాడు.

తరువాత చదువుకుందాం–

**ఆదికాండము 24:10**

**"అతడు తన యజమానుని ఒంటెలలో పది ఒంటెలను...తీసికొని పోయెను..."**

అవును! ఇచ్చట ఎలీయెజెరు...**పది ఒంటెలను** తీసుకున్నాడు!!!

**అయితే ఇది దేన్ని సూచిస్తున్నది?**

ఇది **లూకా 19:13వ** వాక్యములో పేర్కొనబడిన **"10 మినాలలోను"** మరియు

**లూకా 15:8వ** వాక్యములోని ఉపమానంలో చెప్పబడిన **"10 వెండి నాణెములలోను"** దాగివున్న మర్మములను సూచించుచున్నది.

## దీనికి అర్థమేమి?

ఇది దేవుని యొక్క మాటలను సూచిస్తున్నది, మరియు ప్రత్యేకముగా...ఆ మాటలలోని **పది విధమైన గొప్ప సత్యములను** కూడా సూచించుచున్నది.

అవునండి! పరిశుద్ధాత్మ ఈ సత్యములను **"తీసుకొనివెళ్ళి"** సంఘమునకు బయలు పరుస్తున్నది లేక బహిర్గతం చేస్తున్నది.

దీనిని గూర్చి క్రింది వాక్యంలో చదువుకుందాం –

**యోహాను 16:13 – "మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును..."**

అవునండి! ఈ పది **ప్రత్యేకమైన సత్యాల గురించి 46వ పాఠంలో** ధ్యానిద్దాం.

తరువాత మనం చదువుతున్నది ఏమిటని ? క్రింది వాక్యంలో చదువుకుందాం–

**ఆదికాండము 24:11**

**"...ఆ ఊరి బయటనున్న నీళ్లబావియొద్ద తన ఒంటెలను మోకరింపచేసి యిట్లనెను..."**

## ఇది దేనిని సూచిస్తున్నది?

ఈ యొక్క **"బావి" – "జీవ జలమైనటువంటి" పరిశుద్ధ గ్రంథమగు బైబిలును** సూచిస్తున్నది.

**యోహాను 4:10 – "...నీవు ఆయనను అడుగుదువు, ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను."**

తరువాత చదువుకుందాం–

**ఆది. 24:11 – "సాయంకాలమందు స్త్రీలు నీళ్లు చేదుకొనవచ్చు వేళకు..."**

ఇది "జీవజలము" కొరకు దేవుని మాటలను **వెదకుతున్న** మరియు **కోరుతున్న...వివిధ సంఘములలోని...క్రైస్తవులను** సూచిస్తుంది.

## రిబ్కా

క్రీస్తుకు కాబోయే వధువును సూచిస్తున్నది –

**.....ఇది సంఘము అను తరగతి.**

ఆమె **"చాలా అందముగాను"** మరియు..."**కన్యకగాను"** ఉండుట...**వధువు సంఘము** అను తరగతి యొక్క మంచి **స్వభావమును** మరియు...దేవుని వాక్యమనే **స్వచ్ఛమైన సత్యమునకు** వారు **విశ్వాస్యతను** కలిగివుండడాన్ని సూచిస్తున్నది.

తరువాత చదువుకుందాం.

**ఆదికాండము 24:19-21**

**"త్వరగా గాడిలో తన కడవ కుమ్మరించి తిరిగి చేదుటకు ఆ బావికి పరుగెత్తుకొని పోయి అతని ఒంటెలన్నిటికి నీళ్లు చేదిపోసెను."**

**ఇది దేనిని సూచిస్తున్నది?**

ఇది దేవుని యందు మరియు సత్యమునందు "వధువు సంఘము" అను తరగతి వారి యొక్క **అలుపెరుగని సేవలోని** శక్తిని మరియు...**ఉత్సాహాన్ని** సూచిస్తుంది...వారి కొరకు మాత్రమే **సత్యమును** కోరుకొనక ఇతరులకు ఇవ్వడానికి కూడా కోరుకొందురు...అయితే ఇది **గొప్ప వ్యక్తిగతమైన శ్రమతో** కూడుకున్నది.

తరువాత చదువుకుందాం.

**ఆదికాండము 24:22**

**"...ఆ మనుష్యుడు...బంగారపు ముక్కుకమ్మిని(ఆంగ్లములో కమ్మలు),.... రెండు బంగారు కడియములను తీసి..."**

ఇది దేనిని సూచిస్తున్నది?

**ఇవి విలువైన బహుమతులు !!**

ఇది **పరిశుద్ధాత్మ (అనగా ఇక్కడ ఎలీయెజెరు)** ద్వారా "వధువు సంఘము" అను తరగతిలోని వారు స్వీకరించబోయే –

**"బంగారపు"** బహుమతులను లేదా...**దైవీక బహుమతులను** సూచిస్తున్నది.

**(ప్రత్యక్ష గూడారము యందు "పరిశుద్ధ స్థలములో" మరియు "అతి పరిశుద్ధ స్థలములో" వున్న వస్తువులన్ని బంగారువి కాబట్టి...బంగారం దైవీక స్వభావమును సూచిస్తున్నది.)**

**కమ్మలు**

దేవుని దైవీక శక్తి ద్వారా తెరువబడిన **"అర్థం చేసుకొనే చెవుల"** యొక్క



"వినికిడిని" సూచిస్తున్నది.

"చెవిగలవాడు వినునుగాక" – అను ఈ యేసుక్రీస్తు మాటలను జ్ఞాపకం చేసుకొనండి.

**ఆయన మాటల యొక్క అర్థమేమనగా- "పరిశుద్ధాత్మ నుండి కమ్మలు స్వీకరించుకున్న వారెవరో వారు విందురుగాక."**

## కడియములు



చేతులు పనిని లేదా సేవను తెలియపరుస్తున్నందువలన, ఇది దైవీక అధికారం ద్వారా **దేవుని సేవలోని** పనులను చేయుటకు దొరికే మంచి **అవకాశములను** సూచిస్తుంది.

ఇంకను చదువుకున్నట్లైతే, **(నిశ్చితార్థం)వివాహ సంబంధం స్థిరమైన తరువాత**...రిబ్కా **మరిన్ని బహుమతులను పొందుకున్నట్లు** చదువగలము.

**ఆదికాండము 24:53**

**"తరువాత ఆ సేవకుడు <u>వెండి నగలను బంగారు నగలను, వస్త్రములను</u> తీసి రిబ్కాకు ఇచ్చెను..."**

రిబ్కాకు ఇచ్చిన బహుమతులు, **<u>కాబోయే "వధువగు సంఘము"</u>** క్రీస్తు విశ్వాసంలోను మరియు దేవుని వాక్య జ్ఞానంలోను **అభివృద్ధి** చెందిన తరువాత దేవుడిచ్చు బహుమతులను సూచిస్తుంది.

### 1) వెండి నగలు

వెండి విలువైన దేవుని **సత్యమునకు** ఛాయగా ఉన్నది, దీనిని గూర్చి క్రింది వాక్యములో చదువగలము-

**కీర్తనలు 12:6 –"యెహోవా మాటలు పవిత్రమైనవి అవి మట్టిమూసలో ఏడు మారులు కరగి ఊదిన వెండి యంత పవిత్రములు."**

అవును! పరిశుద్ధ గ్రంథమైన బైబిలులోని వచనములు మరియు మాటలు తెరువబడియున్నది, **దైవీక ప్రణాళికలోని సత్యాన్ని** అర్థము చేసుకొనుటకు

విలగుచున్నది. ఇదియే పొందుకొనిన మొదటి గొప్ప బహుమానం.

## 2) బంగారు నగలు

**"దేవస్వభావమునందు పాలివారగునట్లు"** ఆయన మనకు అనుగ్రహించియున్న **"అమూల్యములును అత్యధికములునైన వాగ్దానములను"** సూచిస్తుంది, దీనిని క్రింది వాక్యములో చదువుదాం-

**2 పేతురు 1:4 - "...ఆయన మనకు అమూల్యములును అత్యధికములునైన వాగ్దానములను అనుగ్రహించియున్నాడు...దేవస్వభావమునందు పాలివారగునట్లు వాటిని అనుగ్రహించెను."**

అవును! ఈ "బంగారం"...**గొప్ప పరలోకపు రక్షణకు ఆహ్వానమును** సూచిస్తుంది, ఇప్పుడు అది "సంఘము" అను తరగతి వారికి విస్తరించి యున్నది. దీని గూరించి **రాబోయే 17,18,19 పాఠాలలో** వివరముగా ధ్యానించుకుందాం.

## 3) వస్త్రములు

ఇది **"నీతి అను పైబట్టను"** లేదా వస్త్రమును సూచిస్తుంది.

ఇది పాపాన్ని కప్పడమే కాకుండా ప్రస్తుత కాలంలో "పరలోక కృపాసనం" వద్దకు అనుమతినిస్తుంది మరియు ఒకని **"నీతిమంతునిగా"** చేయునదిగా ఉన్నది, దీనిని గూర్చి క్రింది వాక్యములో చదువుదాం-

**యెషయా 61:10 - "...ఆయన రక్షణవస్త్రములను నాకు ధరింపజేసి యున్నాడు <u>నీతి అను పైబట్టను</u> నాకు ధరింపజేసియున్నాడు..."**


అవును! **"వస్త్రము"** దేవుని కృప ద్వారా కలుగు **నీతిని** మరియు కలువరి సిలువపై యేసు **విమోచన క్రయధనముగా** సమర్పించుకొనిన రక్తం ద్వారా కప్పబడు పాపములను సూచిస్తున్నది.

**ఈ విధంగా పరిశుద్ధాత్మ ద్వారా సంఘము పై చెప్పబడిన "ఆత్మీయమైన" బహుమతులన్నింటినీ పొందుకొనును, ఇక్కడ ఎలీయెజెరు పరిశుద్ధాత్మకు ఛాయగా ఉన్నాడు.**

తరువాత చదువుకుందాం.

## ఆదికాండము 24:58

**"రిబ్కాను పిలిచి - ఈ మనుష్యునితోకూడ వెళ్లెదవా అని ఆమె నడిగినప్పుడు - వెళ్లెదననెను."**



ఇది యేసు ప్రభువుపై **సంఘము** అను తరగతి వారి యొక్క **"నమ్మకమును"** మరియు **"విశ్వాస్యతను"** సూచిస్తున్నది మరియు అది యేసు ప్రభువు యొక్క అడుగు జాడల యందు ఏమి జరిగినను **అనుసరించడానికి**...వారి సిద్ధపాటును సూచిస్తున్నది.

అవును! **1 పేతురు 1:8వ** వాక్యములో వ్రాయబడిన విధంగా - **"మీరాయనను చూడక పోయనను ఆయనను ప్రేమించుచున్నారు".**

రిబ్కా తెలియని వ్యక్తిని వెంబడించుట యందు తన ప్రాణాలను **పనంగా** పెట్టినది కొంతమట్టుకు ఎరిగి ఉండెను గనుక సంఘము కూడ ఒకసారైనను **ప్రత్యక్షముగా చూడని** మరియు **<u>తెలియని వ్యక్తియగు యేసు ప్రభువును</u>** వెంబడించుట యందు ప్రాణాలను **"ప్రమాదములో"** ఉంచి, తమ జీవికాలమంతటిని అంకితం చేసెనని చూస్తున్నాము.

మరియు మనం వారియొక్క అసాధారణమైన ఆశీర్వాదం గురించి చదువుకుందాం-

## ఆదికాండము 24:60

**"...నీవు వేల వేలకు తల్లి వగుదువు గాక,..."**

ఈ యొక్క **ఆశీర్వాదం** చాల అసాధారణమైనది! దీనికి అర్థమేమి?

ఒక స్త్రీ అనేక మంది పిల్లలను ఎలా ప్రసవించగలదు?

**ఊహించి చూడండి!**

ఇచ్చట మనం రిబ్కా ఎవరికి **ఛాయా రూపకంగా** వున్నదో తెలుసుకునప్పుడు మాత్రమే ఈ ఆశీర్వాదం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొనగలము -

మనం ఇదివరకు చూసిన విధముగా రిబ్కా **సంఘానికి** ఛాయగా ఉన్నది, యేసు ప్రభువుతో అది గొఱ్ఱెపిల్ల యొక్క **"వధువు"** అనే నామముతో మహిమపరచబడుతుంది. **(ప్రకటన 22:17)**

**ఇంకను అనేక విషయాలున్నవి!**

ఆమె **"రెండవ ఆదాము"నకు** "రెండవ హవ్వ"...అవ్వాలి. **(1 కొరింథీ. 15:45)**

**పునరుత్థానములో** యేసు మరియు సంఘము **కలిసి** లోకమునకు జీవమును ఆశీర్వాదమును ఇచ్చుదురు, దానిని గూర్చి క్రింది వాక్యములో చదువుకొందాం–

**ప్రకటన 22:17**

**"ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచునారు వినువాడును రమ్ము అని చెప్పవలెనుబీ దప్పిగొనిన వానిని రానిమ్ము, ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము."**

అవును! ఈ ప్రపంచ మానవాళి – అనగా అనేక లక్షల కోట్ల మంది ప్రజలు – వీరికి **"వేల వేల"** మంది ప్రజలందరు పిల్లలుగా వుందురు.

క్రీస్తు యొక్క వధువగు **"సంఘానికి"** సూచకముగా ఉన్న **"గుణవతియైన భార్యను"** గూర్చి మరలా **సామెతలు 31వ అధ్యాయములో 10–31వ వచనము** వరకు ప్రస్తావించబడియుండుట చూస్తున్నాం మరియు దీనిని గూర్చి **సామెతలు 31:28వ** వాక్యములో చదువగలము–

**"ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందురు..."**

అవును! ఈ లోకములోని మనుష్యులందరు పునరుత్థానంలో యేసుప్రభువుకిని–సంఘానికిని **"పిల్లలుగా"** అగుటకు **"లేపబడుటను"** సూచిస్తుంది.

**వారి సంఖ్య "వేల వేలు" లేదా...100 కోట్లలలో ఉండును.** తరువాత చదువుకుందాం.

**ఆదికాండము 24:61**

**"...లేచి ఒంటెల నెక్కి ఆ మనుష్యుని వెంబడివెళ్లిరి..."**

అవును! ఇంటికి తిరిగి ప్రయాణం చేసిరి!

**ఇది దేన్ని సూచిస్తుంది?**

ఎలీయెజెరుతో రిబ్కా యొక్క ప్రయాణం, **సువార్త యుగాములో** నున్న సంఘము యొక్క **"భూసంబంధమైన ప్రయాణపు"** **కాల వ్యవధికి** ఛాయగా ఉన్నది.

**అవును! ఈ ప్రయాణం పరలోక కనానుకు.**

అటుతరువాత చివరిగా చదువుకుందాం-

**ఆదికాండము 24:62-67**

**"ఇస్సాకు బెయేర్ లహాయిరోయి మార్గమున వచ్చి దక్షిణ దేశమందు కాపురముండెను. సాయంకాలమున ఇస్సాకు పొలములో ధ్యానింప బయలువెళ్లి కన్నులెత్తి చూచినప్పుడు ఒంటెలు వచ్చుచుండెను, రిబ్కా కన్నులెత్తి ఇస్సాకును చూచి ఒంటెమీద నుండి దిగి, మనల నెదుర్కొనుటకు పొలములో నడుచుచున్న ఆ మనుష్యుడెవరని దాసుని నడుగగా అతడు-ఇతడు నా యజమానుడని చెప్పెను గనుక ఆమె ముసుకు వేసికొనెను. అప్పుడా దాసుడు తాను చేసిన కార్యములన్నియు ఇస్సాకుతో వివరించి చెప్పెను. ఇస్సాకు తల్లియైన శారా గుడారములోనికి ఆమెను తీసికొని పోయెను. అట్లు అతడు రిబ్కాను పరిగ్రహింపగా ఆమె అతనికి భార్య ఆయెనుబీ అతడు ఆమెను ప్రేమించెను. అప్పుడు ఇస్సాకు తన తల్లి విషయమై దుఃఖనివారణపొందెను."**

ఈ లేఖన భాగాలన్నీ...సువార్త యుగము యొక్క **ముగింపును** మరియు మన ప్రభువైన యేసుక్రీస్తు గారి **రెండవ రాకడను** మరియు రెండవ రాకడ **తరువాత** **మొదటి పునరుత్థానంలో**... సంఘము

**"తన ప్రభువును"**

ఎదుర్కొని వెళ్ళి కలుసుకొనే తరుణాన్ని సూచిస్తుంది,

ఈ మొదటి పునరుత్థానులను గూర్చి **1 థెస్స. 4:16**వ వాక్యములో **"క్రీస్తునందుండి మృతులైన వారు"** అని చెప్పబడియున్నది.

**వారి పునరుత్థానం గురించి లోతైన మర్మములను రాబోయే తరగతులలో ధ్యానించుకుందాం.**

ప్రతి వరుడు తన నూతన వధువు అందాన్ని చూచు విధంగా ఇస్సాకు కూడా రిబ్కా యొక్క మేలి ముసుగును తొలగించి ఆమె యొక్క అందాన్ని పరీక్షించి ఉండవచ్చునని ఈ సందర్భములో **మేము సూచిస్తున్నాము.**

ఇదేవిధంగా యేసుప్రభువు కూడా తన నూతన వధువు యొక్క **అందాన్ని** చూస్తున్నాడు.

**కాని ఏ విధమైన అందాన్ని యేసుప్రభువు ఎదురు చూస్తున్నాడు?**

దీనిని ఈ క్రింది వాక్యంలో చదువుకుందాం-

**1 పేతురు 3:3,4.**

**"జడలు అల్లుకొనుటయు, బంగారునగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక,"**

**"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల...దేవుని దృష్టికి మిగుల విలువగలది."**

అవును! ఇదే అందాన్ని దేవుడు ఎదురుచూస్తున్నాడు...అది **పవిత్రత** మరియు **పరిశుద్ధత** కలిగిన అందము,

మరియు తాన్నుతాను ఉపేక్షించుకొని, ఎంతో శ్రమలు అనుభవించినప్పుడు మాత్రమే **అట్టి సౌందర్యము అభివృద్ధి** చెందును.

మరియు **1 థెస్స. 4:17**వ వాక్యములో ఆమె అనగా **సంఘము**..."**సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము.**" అని వ్రాయబడియున్నది.

అవును! ఒక ప్రేమకథవలె ఇస్సాకు మరియు రిబ్కా యొక్క కథ కూడ వారి వివాహముతో ముగిసింది. కావున **ప్రకటన 19:7**వ వాక్యం ప్రకారం యేసు మరియు సంఘము యొక్క ప్రేమకథ కూడ,

**గొఱ్ఱెపిల్ల యొక్క గొప్ప వివాహోత్సవముతో ముగియనున్నదని చూస్తున్నము !**

**కావున మనం పాత నిబంధనలో దృష్టాంతముగా చెప్పబడిన ఒక భాగాన్ని మరియు దానిని ప్రతిఫలింపజేయు నిజరూపమగు ఒక ఉదాహరణను గూర్చియు, మరియు ఇటువంటి దైవీకమైన సత్యముల యందు "మనకున్న" బోధలను తెలుసుకొనియున్నాము.**

మరియు ఈ విధముగా **అనేక దృష్టాంతములు(ENSAMPLES)** లేదా **ఛాయలు(TYPES)** పాత నిబంధన గ్రంథములో ఉన్నది. అవేవనగా..

- ఇశ్రాయేలీయులు, వారి బానిసత్వం, మరియు మధ్యవర్తియగు మోషే ద్వారా విడుదల నొంది - కనానుకు ప్రయాణం చేయడం.

- బైబిలులో "పరమగీతం" అను పుస్తకము సంఘము మరియు యేసుప్రభువు మధ్యగల దగ్గరి సంబంధాన్ని తెలియబరుస్తున్నది.

- ప్రత్యక్ష గూడారము, అందులో ఉపయోగించబడిన వస్తువులు మరియు నానా విధమైన బలుల యొక్క సూచకములు. (హెబ్రీ 9:9,10)

- ధర్మశాస్త్రం మరియు వాటి సహజ లక్షణమైన పస్కా, జూబిలి మరియు అనేకమైనటువంటి ఆత్మీయమైన ఆభరణాల వంటి సత్యాలు బైబిలులోని పాత నిబంధన గ్రంథమునందు నిక్షిప్తమైయున్నది,

- దీనిని గురించి క్రమంగా రాబోవు తరగతుల యందు దేవుని చిత్తమైతే ధ్యానించుకుందాం.

# -ఆమెన్-






For Private Circulation Only

NOT FOR SALE

For more Subjects contact: 9244208043, 9701462845. E-mail: selva_1874@yahoo.co.in